సాక్షి
పార్వతీపురం మన్యం
శుక్రవారం । 24 । మార్చి । 2023



ప్రాణ క్షయం

క్షయ వ్యాధి ఒకప్పుడు సమాజాన్ని పట్టిపీడించేది. ప్రభుత్వాలు నియంత్రణ చర్యలు చేపట్టడం వల్ల వ్యాధి కాలక్రమేణా అదుపులోకి వస్తోంది. - 8లో



మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని స్పెషల్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఏఎస్పీ) ఆస్మాఫర్హీన్ సూచించారు. - 8లో

తాగునీటి సమస్యలపై మానటరింగ్ సెల్

విజయనగరం ఫోర్ట్: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాలో తాగునీటి సమస్యలు పరిష్కారం కోసం తమ కార్యాలయంలో మానటరింగ్ సెల్ ఏర్పాటు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.ఉమాశంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల మధ్య 91001 20711 నంబరుకు ఫోన్ చేసి తాగునీటి సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొన్నారు.



న్యూస్‌రీల్

రస్తాకుంటుబాయిలో కిసాన్ మేళా రేపు

సీతంపేట: రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం కిసాన్‌మేళా జరుగుతుందని స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి సీతారాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్నత పర్వత శ్రేణి, ఎత్తైన గిరిజన ప్రాంతం చింతపల్లి, పార్వతీపురం, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని రైతులకు అగ్రీటూరిజం – గిరిజన రైతుల సాధికారితపై ఈ మేళా ఉంటుందన్నారు. రైతులు పాల్గొని వ్యవసాయ సాంకేతిక ప్రదర్శనలు, వ్యవసాయ యాంత్రీకరణ, డ్రోన్ మొదలైన వాటిని ప్రదర్శించాలని సూచించారు.

వీడీవీకే యూనిట్లు పకడ్బందీగా నిర్వహించాలి

- డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్



చిప్స్ తయారీ యూనిట్‌ను పరిశీలిస్తున్న పీడీ విద్యాసాగర్

సీతంపేట: వన్‌ధన్ వికాస్ కేంద్రాలు (వీడీవీకే) యూనిట్లు పకడ్బందీగా నిర్వహించాలని శ్రీకాకుళం డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ తెలిపారు. స్థానిక ఐటీడీఏ ఆవరణలో ఉన్న అరటితో చిప్స్ తయారీ, బిస్కెట్లు తయారీ, కొండచీపుర్ల, జీడి ప్రాసెసింగ్ కేంద్రాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలతో మాట్లాడారు. మార్కెట్ సౌకర్యంపై ఆరా తీశారు. తయారు చేసిన ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ ఉండేలా చూడాలన్నారు. సీతంపేట ఐటీడీఏ పరిదిలో 5 వీడీవీకే యూనిట్లు ఉన్నాయని వీటిని పరిశీలించాలని ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు అన్ని చోట్ల సందర్శిస్తున్నామన్నారు. తొలుత సీతంపేటలో పరిశీలించిన అనంతరం మిగతా యూనిట్లు కూడా తనిఖీ చేయనున్నామన్నారు. ఆయన వెంట వైకేపీ ఏపీడీ నారాయణరావు, డీపీఎం రమణ, హెచ్‌డీ ఏపీఎం పార్వతీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి కల్యాణానికి పవిత్ర గోటి తలంబ్రాలు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలో ఈ నెల 30న జరగబోయే శ్రీరామనవమి కల్యాణానికి గోటితో తొలచిన కోటి తలంబ్రాలు సిద్ధమయ్యాయి. రామతీర్థం సేవా సంఘం ఆధ్వర్యంలో సిద్ధం చేసిన గోటి తలంబ్రాలను 2017 నుంచి శ్రీరాముడి కల్యాణానికి అర్చకులు వినియోగిస్తున్నారు. ఏపీతో పాటు తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన పలువురు భక్తులు ప్రత్యేకం సేద్యం చేసిన ధాన్యాన్ని గోటితో తొలిచి తలంబ్రాలుగా మార్చారు. సిద్ధం చేసిన తలంబ్రాలను రామతీర్థం సేవా సంఘం ప్రతినిధులకు రామ భక్తులు పంపించారు. పవిత్ర తలంబ్రాలను శ్రీరామనవమి రోజున నిర్వహించబోయే స్వామి కల్యాణంలో తలంబ్రాల సేవకు అర్చకులు వినియోగిస్తారని విజయ్‌కుమార్ తెలిపారు.

చిరుధాన్యాల్లో పోషకాలు అధికం



కార్యక్రమంలో మాట్లాడుతున్న స్వప్నలత

విజయనగరం ఫోర్ట్: చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఎన్ఆర్‌సీ న్యూట్రీషియనిస్ట్ స్వప్నలత అన్నారు. పోషణ పక్వాడ పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక దాసన్నపేట హైస్కూల్లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చోడి, కొర్ర, సామల మొదలైన చిరుధాన్యాలతో కూడిన పోషకాహారాన్ని తీసుకుంటే ఆడపిల్లలు శారీరకంగా ధృడంగా ఉంటారని తెలిపారు. బాల్య వివాహాలను అరికట్టాలని కోరారు. బాల్య వివాహాలు ఎక్కడైనా జరిగితే చైల్డ్‌లైన్ 1098కుగాని, పోలీసులకుగాని సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ జి.ప్రసన్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గనివాడ ఎర్రయ్యమ్మ, మేరీ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు ఆసరా

మహిళల ఆర్థికాభివృద్ధితో పాటు సాధికారతకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తన వంతు కృషి చేస్తోంది. ఇందు కోసం అనేక పథకాలు మహిళలకే వర్తించేలా తెచ్చి పక్కాగా అమలు చేస్తోంది. దీంతో జిల్లాలో మహిళలు స్వయం శక్తిపై ఎదుగుతూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

- మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి
- సంక్షేమ పథకాలతో ఆర్థిక అండ
- ఆర్థికాభివృద్ధి దిశగా మహిళామణులు
- రూ.947.94 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు
- సున్నా వడ్డీ పథకం ద్వారా రూ.30.50 కోట్ల మేర వడ్డీ రాయితీ
- వైఎస్సార్ ఆసరా మూడో విడత నగదు జమ రేపు
- ఆసరాతో రూ.157.84 కోట్ల మేర ప్రయోజనం



పార్వతీపురం మండలంలో బ్యాంకు లింకేజీ రుణాలకు మహిళల వేలిముద్రలను సేకరిస్తున్న సిబ్బంది

పార్వతీపురం టౌన్:

రాష్ట్రంలో మహిళల ఆర్థిక సాధికారతకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. అందులో భాగంగానే వారి సంక్షేమానికి పలు పథకాలు ప్రవేశపెట్టి వారి ఆర్థికాభివృద్ధికి పాటుపడుతోంది. అదే సమయంలో మహిళలు కూడా ఈ సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. కుటీర పరిశ్రమలు, కిరాణ దుకాణాలు, డెయిరీ ఫాంలు నిర్వహిస్తూ ఆర్థికోన్నతి చెందుతున్నారు. నవరత్నాలు అమలులో ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోంది. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా తదితర పథకాలతో పాటు పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, రాయితీలు అందిస్తోంది. రుణాలను బ్యాంకుల నుంచి విరివిగా మంజూరు చేయిస్తోంది. మూడున్నరేళ్లుగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్న పథకాల లబ్ధితో జీవన ఉన్నతికి బాటలు వేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో మొత్తం 19,528 స్వయం సహాయక సంఘాల్లోని 2,25,667 మంది మహిళలకు బ్యాంకుల ద్వారా ఆర్థిక సహాయం అందుతోంది.

రూ.947.94 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు

రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుండగా, దీనికి బ్యాంకులు తోడ్పాటు అందిస్తున్నాయి. బ్యాంకు లింకేజీ ద్వారా 2022 – 23 ఆర్థిక సంవత్సరానికి ఈ ఏడాది సెప్టెంబర్ 30 నాటికి స్వయం సహాయక సంఘాల పరిధిలో ఉన్న 2,60,500 మంది లబ్ధిదారులకు రుణ పంపిణీ లక్ష్యం కాగా, 2,48,419 మంది మహిళలకు రూ.947.94 కోట్లమేర రుణాలను నేరుగా వారి గ్రూపు ఖాతాల్లో జమ చేశారు. స్త్రీనిధి పథకం కింద 16,496 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణ పంపిణీ లక్ష్యం కాగా 15,200 మందికి రూ.2.20 కోట్లు అందించారు.

ఆసరాతో రూ.157.84 కోట్ల ప్రయోజనం

జిల్లాలోని 4 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 15 మండలాల్లో తొలి విడతలో 14,271 సంఘాలకు సుమారు రూ.78.18 కోట్లు, రెండో విడతలో 14,383 సంఘాలకు రూ.79.65 కోట్లను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. మూడో విడతగా 14,302 సంఘాల్లో 1,65,089 మందికి లబ్ధి చేకూర్చనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 25వ తేదీన ఆసరా నగదు అందించేందుకు చర్యలు చేపట్టారు.

జిల్లాలో మహిళల సంక్షేమం ఇలా...

పథకం	లబ్ధిదారులు	లబ్ధి(రూ.కోట్లలో)
జగనన్న తోడు	12,498	49.99
బ్యాంకు లింకేజి	2,48,419	947.94
వైఎస్సార్ ఆసరా (డీఆర్‌డీఏ)	1,65,083	157.43
వైఎస్సార్ ఆసరా (మెప్మా)	26,014	30.87
వైఎస్సార్ చేయూత (డీఆర్‌డీఏ)	68,032	249.72
వైఎస్సార్ చేయూత (మెప్మా)	7,258	37.38
వైఎస్సార్ సున్నా వడ్డీ	2,24,589	30.50

మహిళలకు పెద్దపీట



మహిళలకు పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి జగనన్న రుణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేను. మహిళలందరినీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఓ అన్నలా ఆదుకుంటున్నారు. స్వయం సహాయక బృందంలో చేరి బ్యాంకు నుంచి రూ.35 వేల రుణం పొందాను. టైలరింగ్ పని ప్రారంభించాను. రూ.2 వేలు నావంతు పెట్టుబడిగా పెట్టాను. వ్యాపారం ఆశాజనకంగా నడుస్తోంది. సకాలంలో రుణం చెల్లిస్తున్నాను. ప్రస్తుతం నెలకు రూ.6వేల నుంచి రూ.8 వేల వరకు సంపాదిస్తున్నాను. సున్నా వడ్డీ రాయితీ వర్తిస్తోంది.

–చుక్క పద్మ, పెద్దబొండపల్లి, పార్వతీపురం

సాధికారత దిశగా అడుగులు



వివిధ పథకాలతో మహిళలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. వ్యాపారాలను ప్రోత్సహిస్తోంది. ఆత్మస్థైర్యాన్ని నింపుతోంది. పొదుపు మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో సంక్షేమ పథకాలన్నింటిలోనూ మహిళలను ప్రధాన లబ్ధిదారులుగా ఎంపిక చేస్తోంది. ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు సాధికారత దిశగా అడుగులు వేయాలి. – కిరణ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ, పార్వతీపురం మన్యం జిల్లా


ప్రశాంత జీవనం

నేను సాయి గణేష్ మహిళా సంఘంలో సభ్యురాలిగా ఉన్నాను. ఇప్పటికే రెండు విడతల్లో రూ 1,60,090 లక్షలను మా ఖాతా ల్లోకి జగనన్న ప్రభుత్వం జమ చేసింది. నా వంతుగా రూ. 22,868 వేలు నాకు బ్యాంకు ఖాతా లో జమ చేశారు. మూడో విడత మొత్తాన్ని జమ చేసేందుకు అధికారులు వేలి ముద్రలు తీసుకున్నారు.ఈ నిర్ణయంతో చిన్న కుటీర పరిశ్రమ ఏర్పాటు చేసుకుని ప్రశాంతంగా జీవనం కొనసాగిస్తున్నాం.

–సంగిరెడ్డి రత్న కుమారి, గోపాలపురం, పార్వతీపురం

సున్నా వడ్డీ భరోసా

మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని నింపి ఆర్థిక భరోసా కల్పించేందుకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. జిల్లాలోని 2,24,589 మంది ఖాతాల్లో రూ.30.50 కోట్ల మేర వడ్డీ రాయితీని జమ చేసింది. దిగువ, మధ్య తరగతి మహిళ ల ఆర్థికాభి వృద్ధే లక్ష్యంగా బ్యాంకులతో పాటు మల్టీ నేషనల్ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుని వ్యాపారం, స్వయం ఉపాధి రంగాల్లో ప్రోత్సహిస్తోంది. క్రమం తప్పకుండా బ్యాంకు రుణాలు తీసుకున్న వారి వడ్డీ రాయితీని ప్రభుత్వమే భరిస్తోంది.



పొందిన రుణం ద్వారా కిరాణా షాప్ నిర్వహిస్తున్న మహిళ

సీఎంకు ఎమ్మెల్యే కళావతి వినతి

- గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్డ్‌లో చేర్చాలి



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: 50 నుంచి 100 శాతం గిరిజన జనాభా గల గిరిజన రెవెన్యూ గ్రామాలను ఐదో షెడ్యూల్డ్‌లో చేర్చాలని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి గురువారం తీసుకువెళ్లారు. గిరిజన అభివృద్ధి, సంక్షేమానికి చేపట్టాల్సిన పలు అంశాలను సీఎంకు వినతిపత్రం ఇచ్చినట్టు ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చే విషయమై కేబినెట్‌లో పెట్టి చర్చిస్తామని సీఎం హామీ ఇచ్చారన్నారు. అలాగే జీవో నంబర్ 3పై కూడా న్యాయం జరిగేలా చూస్తామన్నారని పేర్కొన్నారు. రైతులకు సబ్సిడీపై వివిధ రకాల పరికరాలు, యంత్రాలు సరఫరా చేయాలని కోరినట్టు, మన్యంలో సంచరిస్తున్న ఏనుగులను తరలించే ఏర్పాటు చేయాలన్నారు. ఏనుగుల వల్ల ప్రాణ నష్టం, పంట నష్టం జరిగిన కుటుంబాలకు పరిహారం పెంచాలని తెలియజేశామన్నారు. ఇంటర్మీడియెట్ కళాశాలల్లో సీట్ల పెంపు, డిగ్రీ కళాశాలల అప్‌గ్రేడ్ చేయాలని కోరినట్టు పేర్కొన్నారు. మినీ, మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణానికి నిదులు మంజూరు చేయాలని, భామిని, పాలకొండ, వీరఘట్టం, సీతంపేట పీహెచ్‌సీలను సీహెచ్‌సీలుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరినట్టు తెలిపారు. సమస్యలన్నింటిపై సీఎం సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

కొత్త బ్యాంకు శాఖలకు ప్రతిపాదనలు

పార్వతీపురం: జిల్లాలో ఆరు కొత్త బ్యాంకు శాఖల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసినట్లు కలెక్టర్ నిషాంత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో కొత్త బ్యాంకు శాఖలు ఏర్పాటును చర్చించామని ఆ మేరకు ప్రతిపాదనలు తయారు చేసి రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీకి పంపించామని తెలిపారు. జియమ్మవలస మండలం బొమ్మిక, భామిని మండలం గురండి గ్రామాల్లో భారతీయ స్టేట్ బ్యాంకు శాఖలు, కొమరాడ మండలం గంగారేగువలస, పాచిపెంట మండలం మత్తుమూరు గ్రామాల్లో బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖలు, కురుపాం మండలం మొండెంఖల్లు, పాచిపెంట మండలం పి.కోనవలసలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలు ఏర్పాటుకు ప్రతిపాదించామని తెలిపారు. దీనిపై ఎస్‌బీఐ ఇప్పటికే సర్వే చేపట్టిందని తెలిపారు. జియ్యమ్మవలస మండల బత్తిలిలోను బ్యాంకు శాఖలను ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నట్లు తెలియజేసిందని పేర్కొన్నారు.

పాఠశాలల నిర్వహణ నిధుల విడుదలకు వినతి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కలెక్టర్ విన్నపం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

పార్వతీపురం: పాఠశాల నిర్వహణ నిధులు విడుదల చేయాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డిని కోరారు. కలెక్టర్లతో గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొన్ని పాఠశాలలకు పాఠశాల నిర్వహణ నిధులు విడుదల చేయాల్సి ఉందని, వాటిని విడుదల చేయాలని కోరగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పందిస్తూ విడుదల చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రక్తహీనతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, మెరుగు పరుచుటకు కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణాలకు మౌలిక సదుపాయాలు కల్పన చేయాలని సూచించారు. పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. స్పందన కార్యక్రమం సంతృప్తి మేరకు ఉండాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సంయుక్త కలెక్టర్ ఓ.ఆనంద్, పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యా అధికారి డి.మంజులవీణ, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి డాక్టర్ ఎం.వి.ఆర్ కృష్ణాజి, డీఈఓ డాక్టర్ ఎస్.డి.వి.రమణ, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె.విజయగౌరి, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీరరాజు తదితరులు పాల్గొన్నారు.

తెల్లారిన బతుకులు

- మూడంతస్తుల భవనం కూలిపోవడంతో అన్నాచెల్లెళ్ల మృతి



తల్లిదండ్రులతో దుర్గాప్రసాద్, అంజలి(ఫైల్)



మృతి చెందిన దుర్గాప్రసాద్



అంజలి మృతదేహం

దాబాగార్డెన్స్/మెరకముడిదాం: జీవీఎంసీ 29వ వార్డు పరిధి రామజోగిపేటలో ఒమ్మి అప్పారావుకు చెందిన రెండంతస్తుల ఇల్లు ఉంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో బిహార్‌కు చెందిన రామ్‌విలాస్(చోటు) అద్దెకు ఉంటూ జిల్లా పరిషత్ జంక్షన్ వద్ద నూడిల్స్ దుకాణంలో పని చేస్తున్నాడు. వారం రోజుల కిందట విజయవాడ కృష్ణలంకకు చెందిన కొమ్మిశెట్టి శివశంకర్ అతడు పనిచేస్తున్న నూడిల్స్ పాయింట్ వద్దే పనికి చేరాడు. చోటు వద్దనే శివశంకర్ కూడా ఉంటున్నాడు. అదే ఇంటి మొదటి అంతస్తులో విజయనగరం జిల్లా మెరకముడిదం మండలం గొల్లల మర్రివలసకు చెందిన సాకేటి రామారావు, భార్య సాకేటి కల్యాణి, కుమారుడు దుర్గాప్రసాద్, కుమార్తె అంజలితో నివాసం ఉంటున్నాడు. ఈ కుటుంబం పదిహేనేళ్లగా విశాఖలో నివాసం ఉంటోంది. రామారావు ప్రైవేట్ పనులు చేసుకుంటుండగా, అతని భార్య నగరంలోని ఓ ఆస్పత్రిలో నర్స్‌గా పని చేస్తోంది. కుమారుడు దుర్గాప్రసాద్ ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలు రాస్తున్నాడు. కుమార్తె అంజలి వచ్చే నెల 3వ తేదీ నుంచి జరగనున్న 10వ తరగతి పరీక్షలు రాయనుంది. రెండో ఫ్లోర్‌లో పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం దుమ్మంగికి చెందిన సన్నాపు కృష్ణ, భార్య రోజారాణి నివాసం ఉంటున్నారు. వీరు కూడా ఎనిమిదేళ్ల కిందట వలస వచ్చారు. కృష్ణ దండుబజార్ సమీపంలోని ఓ కేటరింగ్ వద్ద డ్రైవర్‌గా పనిచేస్తుండగా.. అతని భార్య కూడా నగరంలోని ఓ ఆస్పత్రిలో నర్స్‌గా పనిచేస్తోంది.

అసలేం జరిగిందంటే..

బుధవారం ఉగాది పండగను ఘనంగా జరుపుకున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో అద్దెకు ఉంటున్న రామ్ విలాస్ అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో ఇంటికి చేరుకున్నాడు. మరో అరగంటకి కొమ్మిశెట్టి శివశంకర్ వచ్చాడు. అప్పటికే సాకేటి రామారావు కుటుంబం, సన్నాపు కృష్ణ కుటుంబం గాఢ నిద్రలోకి జారుకున్నారు. సమయం ఒంట గంట అయింది. కింది ఫ్లోర్‌లో బిహార్‌కు చెందిన చోటు తన సెల్ ఫోన్ చూసుకుంటూ సేదదీరుతున్నాడు. సహచరుడు శివశంకర్ బాత్‌రూమ్‌కి వెళ్లాడు. ఉన్నట్టుగా ఏదో కదులుతున్నట్టు అనిపించడంతో అతను రూమ్ నుంచి బయటకు వచ్చాడు. అప్పటికే పై రెండు ఫ్లోర్‌లు కూలుతూ కిందకు పడిపోతుండడాన్ని గమనించి బయటకు పరుగులు పెట్టేలోపే మొత్తం ఇళ్లంతా కూలిపోయింది. ఈ ఘటనలో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న రామ్‌విలాస్(30), మొదటి అంతస్తులో ఉంటున్న దుర్గాప్రసాద్(17), అంజలి(15) మృతి చెందారు. శివశంకర్, సాకేటి రామారావు, సాకేటి కల్యాణి, సన్నాపు కృష్ణ, రోజారాణి గాయాలతో బయటపడ్డారు. వీరిలో కల్యాణి పరిస్థితి విషమంగా ఉంది. వీరంతా కేజీహెచ్‌లోనే చికిత్స పొందుతున్నారు.

సహాయక చర్యలు ముమ్మరం

సమాచారం అందుకున్న రాష్ట్ర విపత్తుల శాఖ, రెవెన్యూ, పోలీసు, ఫైర్ విభాగాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నాయి. గురువారం వేకువజాము 2 గంటల నుంచి 7 గంటల వరకు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. శిథిలాల కింద కూరుకుపోయిన క్షతగాత్రులను బయటకు తీశారు. మృతి చెందిన అంజలి, దుర్గాప్రసాద్, రామ్‌విలాస్‌ను అతి కష్టంపై తీయగలిగారు. క్షతగాత్రులను 108లో కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై మహారాణిపేట పోలీసులు కేసు నమోదు చేశారు. అధికారులు, నిపుణులతో దర్యాప్తు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

ఆధార్ నమోదుకు ప్రత్యేక డ్రైవ్



యాప్‌లో నమోదు చేస్తున్న వివరాలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం టౌన్: జిల్లాలోని పిల్లలు, గర్భిణుల ఆధార్ అప్‌డేట్ చేసుకోవడానికి వారం రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశించారు. పార్వతీపురం మండలం నర్సిపురం సచివాలయాన్ని ఆయన గురువారం సందర్శించారు. బెనిఫీసియరీ ఔట్‌రీచ్ ప్రోగ్రాం(బీఓపీ) యాప్, వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్‌లలో డేటా అప్‌డేట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలకు ఆధార్ నమోదు, గర్భిణులకు ఆధార్ అప్‌డేట్, ఆర్‌సీహెచ్ ఐడీ జారీ ప్రక్రియ విధిగా నిర్వహించాలన్నారు. నర్సిపురం పరిధిలో 8 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వాటి పరిధిలో 52మంది గర్భిణులకు 49 మందికి ఆధార్, ఆర్‌సీహెచ్ ఐడీ జారీ పూర్తయ్యిందని, మిగిలిన వారు వివరాలు తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. సాంకేతిక సమస్యలు ఎప్పటికప్పుడు సరిచూస్తూ వివరాల అప్‌డేట్ విధిగా జరగాలన్నారు. ఈ యాప్‌లలో వివరాలు పూర్తి స్థాయిలో ఉండడం వల్ల రక్తహీనత, సంపూర్ణ పోషణ పంపిణీ వంటి కార్యక్రమాలు పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయవచ్చునన్నారు. ఈ నెలలో 27, 28, 29 తేదీల్లో ఆధార్ అప్‌డేట్ చేయడానికి ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ విజయగౌరి, డీపీఓ బలివాడ సత్యనారాయణ, ఐసీడీఎస్ పీఓలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరాల వసంతం.. రంజాన్ మాసం

- నెలరోజులు కఠోర దీక్షలు, దానధర్మాలు
- పాపాల నుంచి రక్షించుకునే అవకాశం
- నేటి నుంచి రంజాన్ మాసం ప్రారంభం



విజయనగరం టౌన్: యావత్తు ప్రపంచంలో ఉన్న ముస్లింలకు అత్యంత పవిత్రమైన, సంతోషాలు పంచే నెల రంజాన్. ఈ నెల అరబీ నెలల వరుస క్రమంలో 9వ నెలగా గుర్తించబడుతుంది. రంజాన్ అంటే 'కాలిపోవడం, భస్మీపటలమవ్వడం, ఆగిపోవడం' అనే అర్థాలను సూచిస్తుంది. రంజాన్ నెలలో ఒక ముస్లిం తన పాపాలు, పొరపాట్లు, తప్పిదాలన్నీ కాలిపోయి వాటికి బదులుగా పుణ్యఫలాలు లభిస్తాయని అర్థం. ఈ సుఖాల సరోవరం, వరాల వసంతం అయిన రంజాన్ మాసం నెలవంకను చూసిన వెంటనే ప్రారంభమవుతుంది. ఈ నెల 24 శుక్రవారం నుంచి ఏప్రిల్ 21 వరకూ రంజాన్ మాసంగా పేర్కొంటూ ముస్లిం మతపెద్దలు నిర్ణయించారు. ఈ నెలకు అల్లాహ్ దృష్టిలో పవిత్రమైన, ప్రత్యేకమైన స్థానముంది. విశ్వాసులకు ఎనలేని సంతోషాలను, పుణ్యాలను అందిస్తుంది ఈ మాసం. ఏడాది మొత్తం ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు చిన్న పిల్లల నుంచి మొదలుకుని వృద్ధుల వరకూ ఈ పవిత్ర మాసం కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకుని ఉంటారు.

క్లుప్తంగా

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి



ఘటనాస్థలంలో అపస్మారక స్థితిలో పడిఉన్న ధనుంజయ

పాలకొండ రూరల్: మండలంలోని అట్టలి గ్రామం వద్ద బైక్ అదుపు తప్పి బోల్తా పడడంతో జరిగిన ప్రమాదంలో విజయనగరం జిల్లా రేగిడి మండలం పారంపేటకు చెందిన కుదిగాన ధనుంజయ(32) మృతి చెందాడు. ఈ ప్రమాదంపై ఎస్సై బి.శివప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భవననిర్మాణ కార్మికుడైన ధనుంజయ పని చేసుకునేందుకు గురువారం పాలకొండ మీదుగా ద్విచక్ర వాహనంపై పార్వతీపురం బయల్దేరాడు. ఈ క్రమంలో అట్టలి వద్ద బైక్ అదుపుతప్పి కిందపడిపోవడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. గమనించిన స్థానికులు పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్య సేవలు పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య మహలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బాలిక మృతి కేసులో ముద్దాయికి రెండేళ్ల జైలు

బొండపల్లి: నిర్లక్ష్యంగా లారీని నడిపి బాలిక మృతికి కారణమైన ముద్దాయికి రెండు సంవత్సరాల జైలు శిక్ష తో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ జిల్లా కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కోర్టు న్యాయమూర్తి షేక్ సికిందర్ బాషా గురువారం తీర్పు ఇచ్చారు. ఇందుకు సంబంధించి ఎస్సై రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయవాడలోని కృష్ణలంకకు చెందిన చలప తి దుర్గాప్రసాద్ 2017వ సంవత్సరంలో లారీ నిర్లక్ష్యంగా నడుపుకుంటూ వస్తూ నెలివాడ జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై బాలికను ఢీకొనడంతో మృతి చెందింది. ఈ మేరకు నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు నిచ్చారు.

పోక్సో కేసులో ఇద్దరికి రిమాండ్

కొత్తవలస: పోక్సో కేసులో ఇద్దరు నిందితులకు కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి రిమాండ్ విధించినట్లు ఎస్సై బొడ్డు దేవి గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 17వ తేదీన మండలంలోని ఓ గ్రామంలో మైనర్లపై దెందేరు గ్రామానికి చెందిన బొబ్బిలి రాజేష్, దాలిబోయిన ఎర్నాయుడులు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు 17వ తేదీన కొత్తవలస పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.ఈ కేసు విచారణ కోసం నిందితులను కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరుపరచగా రిమాండ్ విధించారు. దీంతో ఎస్.కోట సబ్ జైలు నిందితులను తరలించారు.

మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన 15 మంది డీబార్

విజయనగరం పూల్‌బాగ్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (మ్యాథ్స్–1బి, జువాలజీ–1, హిస్టరీ–1పేపర్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 25,835 మంది విద్యార్థులు హాజరు కాగా మాల్ ప్రాక్టీసుకు పాల్పడిన 15 మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు ఆర్ఐఓ ఎం సత్యనారాయణ తెలిపారు. ఇంటర్‌మీడియట్ జనరల్ పరీక్షకు 21139 మంది హాజరు కావాల్సి ఉండగా, 20204 మంది హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షకు 6431 మంది హాజరు కావాల్సి ఉండగా, 5631 మంది మాత్రమే హాజరయ్యారు. ఆర్ఐఓ నాలుగు పరీక్షా కేంద్రాలను, డీఈసీ మూడు కేంద్రాలను తనిఖీ చేశారు. స్క్వాడ్ బృందాలు 42 కేంద్రాలు, ఇతర అధికారులు 8 కేంద్రాలను విస్తృతంగా తనిఖీ చేశారు.

ఆటో బోల్తా: నలుగురికి గాయాలు

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస జాతీయ రహదారిపై దుర్గగుడి సమీపంలో బుధవారం అర్ధరాత్రి ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో నలుగురు గాయాలపాలయ్యారు. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మెదుగు పంచాయతీ పర్తాపురం గ్రామానికి చెందిన గన్నేలబోయిన గుండు, సన్యాసి, చంద్రమ్మ, సోను అనే ఒకే కుటుంబానికి చెందిన నలుగురు బుధవారం ఆటోలో పాచిపెంటలో జరిగిన నూకాలమ్మ జాతరకు వచ్చి తిరిగి పర్తాపురం వెళ్తుండగా పి.కోనవలస జాతీయ రహదారిపై ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108 సహాయంతో వారిని సాలూరు సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. క్షతగాత్రుల్లో గన్నేలబోయిన గుండు పరిస్థితి విషమంగా ఉండడంతో విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసునమోదు చేసినట్లు ఏఎస్సై ముసలయ్య తెలిపారు.

అప్రమత్తం కాకుంటే...ప్రాణ క్షయం

- 2022లో 3,393 కేసులు నమోదు
- 2023లో ఇప్పటి వరకు 670 కేసులు నమోదు
- నేడు ప్రపంచ క్షయనివారణ దినోత్సవం



కఫం పరీక్ష చేస్తున్న ల్యాబ్‌టెక్నీషియన్

విజయనగరం ఫోర్ట్: క్షయ వ్యాధి ఒకప్పుడు సమాజాన్ని పట్టిపీడించేది. ప్రభుత్వాలు నియంత్రణ చర్యలు చేపట్టడం వల్ల వ్యాధి కాలక్రమేణా అదుపులోకి వస్తోంది. త్వరగా ఒకరి నుంచి మరొకరికి ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది కాబట్టి అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. క్షయ వ్యాధి పట్ల అవగాహన ప్రతి ఒక్కరికి అవసరమని చెబుతున్నారు. వ్యాధిని త్వరగా గుర్తించి మందులు పూర్తిస్థాయిలో వాడితే పూర్తిగా నయమవుతుందని స్పష్టం చేస్తున్నారు. శుక్రవారం ప్రపంచ క్షయనివారణ దినోత్సవం సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం.

వ్యాధి లక్షణాలు

ఎడతెరిపి లేకుండా దగ్గు, జ్వరం రావడం, ఆకలి మందగించడం, వికారంగా ఉండడం, ఛాతీలో నొప్పి, బరువు తగ్గడం క్షయవ్యాధి లక్షణాలు. ట్యుబర్క్యులోసిస్ అనే మైక్రో బాక్టీరియా వల్ల క్షయ వ్యాధి వ్యాప్తి చెందితుంది. రోగి దగ్గినప్పుడు వచ్చే ఉమ్మి తుంపర్ల ద్వారా వ్యాధి వ్యాపిస్తుంది.

వ్యాధిలో రకాలు

క్షయ వ్యాధి వెంట్రుకలు, గోళ్లకు తప్ప శరీరంలోని ఏ అవయవానికైనా వస్తుంది. 35 నుంచి 50 ఏళ్ల వయసు గల వ్యక్తుల్లో ఎక్కువగా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. ఊపిరితిత్తులకు సంబంధించి (పలమనరీ టీబీ) అధికశాతం మంది వ్యాధి బారిన పడుతున్నారు. గర్భాశయం, చర్మం, ఎముకలు, కళ్లకు వచ్చే క్షయ వ్యాధిని (ఎక్స్‌ట్రా పలమనరీ టీబీ) అంటారు. ఈ వ్యాధి ఎక్కువగా హెచ్ఐవీ, మధుమేహం, రక్తహీనత, పౌష్టికాహారం లోపం ఉన్న వారికి వచ్చే ఆస్కారం ఉంది.



క్షయ వ్యాధి నివారణ తెలిపే బ్యానర్

వ్యాధి రాకుండా జాగ్రత్తలు

క్షయ వ్యాధిరాకుండా ఉండాలంటే చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. ముఖ్యంగా ధూమపానం, మద్యపానం, సురక్షితం కాని లైంగిక సంబంధాల వంటి వాటికి దూరంగా ఉండాలి. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే మందులను పూర్తి కాలం పాటు వాడాలి. సాధారణ వ్యాధికి 6 నెలల పాటు, మధ్యలో మానివేసి తిరిగి ప్రారంభిస్తే 8 నెలల పాటు, మొండి వ్యాధికి అయితే రెండేళ్ల పాటు మందులు వాడాలి. అలా కాకుండా మందులను మధ్యలో మానివేస్తే రోగ నిరోధక శక్తి క్షీణించి మృత్యువాత పడే ప్రమాదం ఉంది.

జిల్లాలో 34 పరీక్ష కేంద్రాలు

రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, చాతీలో నొప్పి, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే సమీపంలో ఉన్న కఫం పరీక్ష కేంద్రానికి వెళ్లి పరీక్ష చేసుకోవాలి. జిల్లాలో పరీక్ష కేంద్రాలు 34 ఉన్నాయి. అలాగే 14 టీబీ యూనిట్లు ఉన్నాయి. వాటిలో ఏ కేంద్రానికి వెళ్లినా ఉచితంగా పరీక్ష చేసి మందులు అందజేస్తారు.

2019 నుంచి 2023 మార్చి 23 వరకు చేసిన క్షయ పరీక్షలు, నిర్ధారణ అయిన రోగుల వివరాలు

సంవత్సరం	క్షయ రోగులు	మొండిక్షయ
2019	4800	143
2020	3100	77
2021	2800	124
2022	3393	95
2023 మార్చినాటికి		676

వ్యాధిపై అవగాహన

క్షయ వ్యాధి నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాం. వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి పరీక్షలు చేస్తూ వ్యాప్తిని తగ్గిస్తున్నాం. 2025 నాటికి క్షయ వ్యాధిని పూర్తి స్థాయిలో నిర్మూలించాలనే సంకల్పంతో చర్యలు తీసుకుంటున్నాం.

డాక్టర్ రామేశ్వరి ప్రభు,
జిల్లా క్షయ నివారణ అధికారి

గౌరునాయుడికి పతంజలి పురస్కారం

- 29న ప్రదానం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పతంజలి సాంస్కృతిక వేదిక ప్రతినిధులు



పతంజలి పురస్కారగ్రహీత గౌరినాయుడు మాస్టారు

విజయనగరం పూల్‌బాగ్: ప్రముఖ రచయిత, సీనియర్ పాత్రికేయుడు, అనేక పత్రికలకు సంపాదకుడిగా పనిచేసిన స్వర్గీయ కె.ఎన్.వై. పతంజలి పేరున ఏటా అందించే పురస్కారాన్ని ఈ ఏడాది ప్రఖ్యాత రచయిత గంటేడ గౌరునాయుడికి అందజేయనున్నారు. ఈ మేరకు పతంజలి సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన జిల్లా కేంద్రంలోని గురజాడ అప్పారావు స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వేదిక ప్రతినిధుల కమిటీ గౌరునాయుడి పేరును సూచించిందని చెప్పారు. స్నేహ కళా సాహితీ సంస్థను స్థాపించి ఉత్తరాంధ్ర నుంచి ఎందరో కవులు, కథకుల్ని తయారు చేసిన ఘనత గౌరునాయుడి మాస్టారికే దక్కుతుందని భీశెట్టి అన్నారు. వేదిక కార్యదర్శి ఎస్. కె.బాబు మాట్లాడుతూ పతంజలి పేరుతో ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో ప్రముఖ రచయితలు మోహన్, మహర్షి, దేవిప్రియ, సతీష్ చంద్ర, చింతకింది, అట్టాడ అప్పలనాయుడు, పప్పు అరుణ లకు అందచేశామని, 2023లో గంటేడ గౌరునాయుడికి అందజేయనుండడం ఆనందంగా ఉందన్నారు. ఈనెల 29న బుధవారం ఉదయం గురజాడ పబ్లిక్ స్కూల్‌లో ఉదయం 10 గంటలకు జరిగే రాష్ట్ర స్థాయి పురస్కార ప్రదానం కార్యక్రమంలో సాహితీవేత్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు,పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వేదిక ప్రతినిధులు జలంత్రి రామచంద్రరాజు, ఇప్పలవలస గోపీ, గురజాడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

- ఎస్‌ఈబీ ఏఎస్పీ ఆస్మాఫర్హీన్



యువతకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ ఆస్మాఫర్హీన్

బొబ్బిలి రూరల్: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని స్పెషల్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఏఎస్పీ) ఆస్మాఫర్హీన్ సూచించారు. మండలంలోని గోకుల్ విద్యాసంస్థలలో ఎస్ఈబీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మాదకద్రవ్యాలవ్యతిరేక అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏఎస్పీ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యం, జీవితం నాశనమవుతాయని, కుటుంబసభ్యులు దూరమవుతారని, అలాగే మాదకద్రవ్యాలు కలిగి ఉండడం, తరలించడం, వాడడం చట్టరీత్యా నేరమని, వాటిపై ప్రభుత్వం కఠినచర్యలు చేపడుతుందని వివరించారు. ఎవరైనా మాదకద్రవ్యాలు వాడుతున్నా,కలిగి ఉన్నా, తరలిస్తున్నా టోల్‌ఫ్రీనంబర్14500కు ఫోన్ చేసి తమకు తెలియజేయాలని సూచించారు. ఈ సదస్సులో గోకుల్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.హేమలత, సిబ్బందితో పాటు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్, సిబ్బంది పాల్గొన్నారు.

సుందరమైన కావ్యం 'సుందరకాండ'



సుందరకాండను ఆలపిస్తున్న శ్రీనివాస్‌స్వామి

విజయనగరం రూరల్: రామాయణంలో అత్యంత సుందరమైన కావ్యం సుందరకాండ అని హనుమత్ ఉపాసకులు పి.శ్రీనివాస్‌స్వామి పేర్కొన్నారు. జిల్లా కేంద్రం శివారు సారిక సమీపంలో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో శ్రీరామనవమి వసంత నవరాత్రి మహోత్సవంలో భాగంగా శ్రీనివాస్‌స్వామి సుందరకాండ కథాగాన సప్తాహం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో మహిళకు గాయాలు

రాజాం సిటీ: మండల పరిధి పెనుబాక గ్రామంలో కుక్కలు దాడిచేయడంతో గ్రామానికి చెందిన తాడేల ఈశ్వరమ్మ గాయాలపాలైంది. గురువారం వీధిలో నడుచుకుంటూ వెళ్తున్న ఆమెపై ఒక్కసారిగా కుక్కలు దాడిచేశాయి. ఈ దాడిలో ఆమె కాలికి గాయం కావడాన్ని స్థానికులు గమనించి కుక్కలను చెదరగొట్టిన అనంతరం ఆమెను ఆటోలో రాజాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సనందించారు.

చీమలమందు తాగి మహిళ ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం: గరుగుబిల్లి మండల కేంద్రానికి చెందిన ఎం.నాగమణి మనస్తాపానికి గురై చీమల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసింది. ఈ సంఘటనపై పార్వతీపురం ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తన భర్త రాంబాబుతో మనస్పర్థల కారణంగా నాగమణి కొన్నేళ్లుగా అమ్మగారి ఇంటివద్ద ఉంటోంది. ఇటీవల వారి కుమార్తె పుష్పవతి అయ్యింది. ఈ విషయాన్ని భర్తకు ఫోన్‌లో చెప్పగా ఫంక్షన్ చేయకు, నేను రానంటూ కసురుకున్నాడు. ఈ విషయమై మనస్తాపం చెందిన ఆమె ఇంట్లో ఉన్న చీమలమందు తాగేసింది.గమనించిన స్థానికులు ఇంటిలో ప్రాథమిక చికిత్స అందించి 108 వాహనంద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కోడిగుడ్ల ధరలు	
హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్	
విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150–00
బంగారం(22సి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹ 200

ఆపరేషన్లు చేయడంలో విఫలం



ఫిర్యాదు పత్రాలను చూపిస్తున్న గో సంరక్షణా సమితి ప్రతినిధులు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్‌లో పరిధిలో కుక్కల ఆపరేషన్ల స్కామ్‌పై విచారణ చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ డిమాండ్ చేశారు. నగరంలోని గో సంరక్షణ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో కుక్కలకు ఆపరేషన్లు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. యానిమల్ బర్త్ కంట్రోల్ యాక్ట్ 2001 నిబంధనల ప్రకారం కాకుండా కుక్కలను కర్రలతో, తాళ్లతో కట్టి హింసిస్తున్నారని తెలిపారు. కుక్కలకు శస్త్రచికిత్సలు చేసే సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో మృత్యువాత పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టర్ అనుమతులు లేకుండా చేపడుతున్న ఈ ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ సెక్రటరీ, డైరెక్టర్ అండ్ కమిషనర్ మున్సిపల్ శాఖ (అమరావతి) వారికి రిజిష్టర్ పోస్టు ద్వారా ఫిర్యాదు చేశామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేవీఆర్ సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు పాండ్రంకి మురళి, రావాడ గణపతి, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల నిరసన



కలెక్టర్ సూర్యకుమారికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

విజయనగరం అర్బన్: డిమాండ్ల సాధనలో భాగంగా గురువారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. ఐజేయూ పిలుపు మేరకు 'సేవ్ జర్నలిజం డే' పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా కలెక్టరేట్ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ సూర్యకుమారికి వినతిపత్రం అందజేశారు. ఏపీయూడబ్ల్యూజే నాయకుడు పీఎస్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యూనియన్ నాయకులు జీవీ ప్రసాద్, వి. మహాపాత్రో, పంచాది అప్పారావు, వైఎస్ పంతులు, నాగరాజు, ఎంఎస్ఎన్ రాజు, భరత్, డేవిడ్‌రాజు, ప్రతాప్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల మేరకే కుక్కలకు శస్త్రచికిత్సలు

విజయనగరం: నగరంలో వీధి కుక్కల సంచారం ఎక్కువగా ఉందని, చిన్నారులపై దాడి చేసే అవకాశం ఉందని ప్రజలు ఫిర్యాదు చేయడంతో కుక్కలకు శస్త్రచికిత్సలు చేసినట్లు నగర పాలక సంస్థ ప్రజారోగ్య అధికారి సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 630 కుక్కలకు ఆపరేషన్లు చేయించామన్నారు. వాటిని రెండు రోజుల పాటు సంరక్షించి అవసరమైన ఆహారం, మందులు అందించామని పేర్కొన్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

విజయనగరం టౌన్: నిరుపేద మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు నవ యువత వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు బి.స్వాతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు 45 రోజులు శిక్షణ ఇస్తామని, ఆసక్తి గల వారు ఈ నెల 31లోగా లక్కపందిరివారి వీధిలో ఉన్న తమ కార్యాలయానికి నేరుగా వచ్చి దరఖాస్తులు అందజేయాలన్నారు. ఏప్రిల్ 5వ తేదీ నుంచి బ్యాచ్‌లు ప్రారంభమవుతాయన్నారు. వివరాలకు 90009 43413 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జగనన్న తోడు పథకంపై సమీక్ష

భోగాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న తోడు పథకంపై వైఎస్సార్ క్రాంతిపథం సిబ్బందితో ఎంపీడీఓ దాసరి బంగారయ్య గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, మండలంలోని సచివాయాల ద్వారా 691 మంది లబ్ధిదారులు జగనన్న తోడు పథకానికి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారిలో ఇప్పటికే 349 మంది లబ్ధిదారులను గుర్తించి మండలంలోని వివిధ బ్యాంకులకు వారి దరఖాస్తులకు పంపించామన్నారు. మిగిలిన 342 మంది లబ్ధిదారుల దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి బ్యాంక్‌లకు అందజేయాలని వైఎస్సార్ క్రాంతిపథం సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం వై.రమణ, సీసీలు శ్రీనివాసరావు, వాసు, విశ్వేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

31న న్యాయవాదుల సంఘం ఎన్నికలు



కార్యదర్శి పదవికి నామినేషన్ వేస్తున్న సంతోష్

విజయనగరం లీగల్: జిల్లా కేంద్ర న్యాయవాదుల సంఘం ఎన్నికలు ఈ నెల 31న జరగనున్నాయి. తొలి రోజు అయిదు నామినేషన్లు దాఖలయ్యాయి. అధ్యక్ష పదవికి బి.కృష్ణారావు, కార్యదర్శి పదవికి వి.జి.సంతోష్, సాంస్కృతిక, క్రీడల కార్యదర్శి పదవికి యు.వి.రాజేష్, కోశాధికారి పదవికి సిహెచ్.శ్రీనివాసరావు, జూనియర్ ఎగ్జిక్యూటివ్ పదవికి ఎస్.సుబ్రమణ్యం నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి పి.శ్రీరామమూర్తి తెలిపారు.

వైభవంగా సిరి సహస్ర, ప్రదీప్ వివాహం



సిరిసహస్ర, ప్రదీప్‌ల వివాహ వేడుక

- నూతన వధూవరులను ఆశీర్వదించిన విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి

విజయనగరం: జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పుష్పాంజలి దంపతుల కుమార్తె సిరిసహస్ర, నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పద్మావతి దంపతుల కుమారుడు ప్రదీప్ వివాహ వేడుక గురువారం వైభవంగా జరిగింది. డెంకాడ మండలం దాకమర్రిలో గల రఘు ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో వేదపండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ నూతన వధూవరులు ఒక్కటయ్యారు. వివాహ వేడుకకు హాజరైన ఎంపీ వి.విజయసాయిరెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, విజయనగరం జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి, జేసీ మయూర్ అశోక్, పార్వతీపురం జిల్లా కలెక్టర్ నిశాంత్‌షా, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్ కౌశిక్‌లతో పాటు ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వచ్చి నూతన వధూవరులను ఆశీర్వదించారు.